క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



దెందులూరు స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న జేసీ బి.లావణ్య వేణి

ఏలూరు(మెట్రో) : దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి శనివారం తనిఖీ చేశారు. ఏలూరులోని సర్ సీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిరోజు స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలించాలన్నారు. ఈవీఎంలకు తలుపులకు వేసిన తాళాలు, వాటికున్న సీళ్లు, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో జేసీ సంతకం చేశారు.

శ్రీవారి వస్త్రాల వేలం ఆదాయం రూ.86 వేలు



ఆలయంలో వస్త్రాలు వేలం వేస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీవారి వస్త్రాల వేలం ద్వారా రూ.86,210 ఆదాయం వచ్చింది. భక్తులు శ్రీవారికి సమర్పించిన పంచెలు, ఉభయ దేవేరులకు సమర్పించిన 103 చీరలు, 64 పంచెలకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముండూరు గ్రూప్ దేవస్థానాల ఈఓ పి.రాజబాబు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27న నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ ప్రాంతం, టీటీడీ కల్యాణ మండపం ప్రాంతం, కలెక్టర్ బంగ్లా రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వేసవి శిబిరంలో ఉత్సాహంగా బాలలు



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో బాలలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నీతి కథలు చెప్పడం, దేశభక్తి గీతాలు పాడించడం, బాలలతో కథలు చెప్పించడం, వివిధ క్రీడలు ఆడించడం విద్యార్థులను ఈ శిబిరానికి వచ్చేలా చేస్తున్నాయి. బాలలతో వివిధ గృహాలంకరణ వస్తువులు తయారు చేయించడం, జ్ఞాపకశక్తిని పంపొందించే వివిధ పద్ధతులపై అవగాహన కలిగిస్తూ రిసోర్స్ పర్సన్లు శిబిరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్లు డి.శ్రీవల్లి, జి.కళ్యాణి, టి.నళిని, కె.మహీధర్, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి దుర్గా ప్రసాద్ తదితరులు వివిధ అంశాలపై బాలలకు శిక్షణ అందిస్తున్నారు. ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహిస్తోన్న ఈ శిబిరంలో గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, బాలలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పద్మావతి

ఏలూరు (టూటౌన్): కిషోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ పీడీ కేఏవీఎల్ పద్మావతి అన్నారు. ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న మాసిక మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు సెక్టార్ ఒకటి పరిధిలోని టైటస్ నగర్ యూహెచ్‌సీలో శనివారం కిషోర బాలికలకు మెన్‌స్ట్రువల్ హైజిన్ సంబంధించిన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ పద్మావతి పాల్గొని మాట్లాడారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రుతుక్రమం, ఆరోగ్య పరిస్థితులను వివరించారు. రుతు క్రమంపై అపోహలు, నిషేధాలు వాడే ఉత్పత్తులు గురించి అవగాహన కల్పించారు. కిషోర బాలికలకు సరైన పౌష్టికాహారం అందకపోతే రక్తహీనత, శరీర ఎదుగుదలలో ఆటంకాలు వంటివి సమస్యలు ఏర్పడతాయన్నారు. యూహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయి నిఖిత మాట్లాడుతూ కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, యూహెచ్‌సీ సిబ్బంది, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ 1938 నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహనరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం నిర్వహించారు. స్థానిక పవర్‌పేట యూపీ పాఠశాలలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గంధం రాంబాబు అధ్యక్షతన జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడిగా పి.రత్నంబాబు, ప్రధాన కార్యదర్శిగా జి.మోహనరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంధం రాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఇ.రామ్మోహనరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా జి.రాజు, ఉపాధ్యక్షులుగా ఆర్‌డీవీ ప్రసాదరావు, ఎం రమేష్‌బాబు, ఎస్‌వీ దుర్గారావు, డి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా జి.అప్పారావు, ఎం కృష్ణమూర్తి, జి.వెంకటరమణ, బి.రామదాసు, పి.రాహుల్, పి.విజయరత్నం, బి.కృష్ణవేణి, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.రత్నంబాబు, జి.మోహనరావు, జి.కృష్ణ, ఇ.రామ్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సంఘ రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు వ్యవహరించారు.

ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగులు వద్దు

సైకాలజిస్టులు, పోలీసుల సూచనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బెట్టింగ్ అనే పదం ప్రస్తుతం యువత నరనరాల్లో జీర్ణించుకుపోయింది. కాదేదీ కవితకనర్హం అన్న చందంగా కాదేదీ బెట్టింగ్‌కు అనర్హం అనే స్థాయికి నేటి యువత చేరుకున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం ఏలూరులో యువత బెట్టింగ్‌లపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు అటు మానసిక నిపుణులు, ఇటు పోలీసులు చెబుతున్నారు. కాగా ఆదివారం బెట్టింగ్‌లు పతాక స్థాయికి చేరుకునే ప్రమాదం ఉందని వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నేడు ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ కావడం, ఈ మ్యాచ్‌లో తెలుగు జట్టు సన్ రైజర్స్ హైదరాబాద్ ఆడనుండడంతో బెట్టింగ్ మానియా పెరిగిపోయింది. ఇప్పటికే ఈ ఫైనల్ మ్యాచ్ కోసం నగరంలోని వివిధ లాడ్జిల్లో యువత రూములు బుక్ చేసుకుని మ్యాచ్ చూడడానికి, చూస్తూ బెట్టింగులు కట్టడానికి ఏర్పాటు చేసుకుంటున్నారు. దాదాపు ఆరు సంవత్సరాల తరువాత తెలుగు జట్టు ఫైనల్ మ్యాచ్ ఆడనుండడం, జట్టులో తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి అద్భుత ప్రదర్శన చేస్తుండడంతో జట్టుపై అంచనాలు పెరిగిపోయాయి. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో నిర్వహించే ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడడానికి ఇప్పటికే నగరానికి చెందిన కొందరు యువత అక్కడకు చేరుకోగా, ప్రత్యక్ష ప్రసారంలో చూడడానికి మరికొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సందర్భంలో బెట్టింగ్‌ల జోరు పెరుగనుందనే అంచనాలు ఉన్నాయి. క్రికెట్ బెట్టింగ్‌లకు సంబంధించిన యాప్‌లు యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రతి బాల్‌కూ బెట్టింగ్ తీరు మార్చుతూ కోసు పందాలకు కూడా ఆయా యాప్‌లు యువతను ప్రోత్సహిస్తున్నాయి. ఈ మ్యాచ్ పేరు చెప్పుకుని అనేక మంది నష్టపోయే ప్రమాదముందని పలువురు పేర్కొంటున్నారు.

బెట్టింగులు చట్ట వ్యతిరేకం



క్రికెట్ బెట్టింగులు చట్ట వ్యతిరేకం. నగరంలో ఎవరు బెట్టింగులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. యువతను ప్రలోభాలకు గురిచేసే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఆదివారం నగరంలో విస్తృతంగా తనిఖీలు చేస్తాం. బెట్టింగుల్లో నష్టపోయి అప్పులపాలైన వాళ్లు ఎందరో ఉన్నారు. నగర ప్రజలు తమ చుట్టుపక్కల ఎక్కడ బెట్టింగులు వేస్తున్నట్టు తమకు సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తాం.

– ఎం ప్రభాకర్, ఏలూరు టూటౌన్ సీఐ

మానసిక బలహీనతే కారణం



బెట్టింగ్‌కు బానిసలయ్యే వారిలో ఎక్కువ శాతం మానసిక బలహీనతకు లోనైన వారు ఉంటారు. వాస్తవికత నుంచి తప్పించుకోవడానికి వ్యక్తులు జూదం వైపు మొగ్గు చూపుతారు. ఈ వ్యసనం డబ్బులు పోయేకొద్దీ మరింత కసిగా అదుపు చేయలేని ఉద్వేగంతో మరింతగా బెట్టింగులకు వెళ్లేలా బలహీనులను చేస్తుంది. నిరాశ, ఆందోళన, ఒత్తిడితో సహా తీవ్రమైన ఆర్థిక, మానసిక నష్టాలను ఈ వ్యసనం వల్ల చవిచూడాల్సి వస్తుంది.

– అక్కింశెట్టి రాంబాబు, సైకాలజిస్ట్, హిప్నోథెరపిస్ట్

మున్సిపల్ కార్మికుల జీతభత్యాలు ఇప్పించాలి

ఏలూరు (టూటౌన్): ఇటీవల సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన జిల్లాలోని మున్సిపల్ కార్మికులకు ఎన్నికల భత్యం ఇప్పించాల్సిందిగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా కమిటీ శనివారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేసింది. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలలోని మున్సిపల్ కార్మికులు ఇటీవల జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13, 14 తేదీల్లో వందలాది మంది మున్సిపల్ కార్మికులు ఎన్నికల విధులు నిర్వహించారని పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, బల్లల ఏర్పాటు, ఈవీఎం బాక్సుల తరలింపు, సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడం వంటి విధులను 13న ఉదయం ఐదు గంటల నుంచి 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఏకదాటిగా నిర్వహించారని తెలిపారు. రెవెన్యూ, సచివాలయ, మున్సిపల్ సిబ్బందికి, టీచర్లకు ఎన్నికల భత్యం చెల్లించి, మున్సిపల్ కార్మికులకు మాత్రమే చెల్లించకపోవడం తగదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ పరిశీలించి మున్సిపల్ కార్మికులకు రావాల్సిన ఎన్నికల భత్యం వెంటనే ఇప్పించాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు కోరారు.

31 నుంచి గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్ : శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో వెలసిన శ్రీగంగానమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం సంబరాలు ఈ నెల 31 తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. 31 ఉదయం 6.30 గంటలకు 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు సామూహిక కుంకుమ పూజ చేయనున్నట్టు పేర్కొన్నారు. 1వ తేదీన విశేష పూజలు, భజన, 2న మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న సమారాధన నిర్వహిస్తామని సభ్యులు గుత్తల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసు, శిరిగిబత్తిన శివనారాయణ పేర్కొన్నారు.

పారిజాతగిరిలో భక్తుల సందడి



పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఉత్తరంవైపు ఏడు కొండల్లో ఆరో కొండపైన పారిజాత వృక్షలలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము 5 గంటలకు సుప్రభాతసేవతో మొదలుకుని, ఆరాధన, బాల భోగనివేదన, తీర్థ ప్రదాగోష్ఠి, అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అష్టోత్తర పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేసవి కాలంలో సెలవులు కావడంతో భక్తులు, ఉద్యోగస్తులు పారిజాతగిరికి పోటెత్తారు. విద్యార్థులు 108 ప్రదక్షిణలు చేసుకుని శ్రీస్వామి వారిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీస్వామి వారి అంతరాలయంలో భక్తులు సౌకర్యర్థం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగాప్రసాద్ ఏసీ బహూకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన పుల్లారావు, శ్రీలక్ష్మి దంపతులు, గాల రాజు, పుష్పలత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు శ్రీస్వామి వారి శేషా వస్త్రాలు ప్రసాదాలుతో సన్మానించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

సారా తయారీని అరికట్టాలి



గంగవరం సమీపంలోని అడవి ప్రాంతంలో సారా కాసేందుకు సిద్ధం చేసిన బెల్లపు ఊట

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరం పరిసర ప్రాంతాలు నాటుసారా తయారీకి నిలయంగా మారాయి. మండల కేంద్రానికి సుదూరంగా ఉండటంతో పాటు కొండలపై ఉన్న అటవీ ప్రాంతం సారా తయారీదారులకు అడ్డాగా నిలిచాయి. కొంతకాలం వరకు సారా తయారీ కేంద్రాలపై సంబంధిత శాఖాధికారులు వలంటీర్ల సాయంతో ఉక్కుపాదం మోపడంతో సారా అక్రమార్కులకు చెల్లుబాటు కాలేదు. ఇటీవల వలంటీర్లు సామూహిక రాజీనామాలు చేయడంతో సారా తయారీదారులకు కలిసి వచ్చింది. ఈ నేపథ్యంలో మళ్లీ సారా తయారీ కేంద్రాలు ఒకటిదాని వెంట మరొకటి పుట్టుకొస్తున్నాయి. గంగవరం గ్రామానికి చెందిన వ్యక్తులు నాటుసారా తయారీ చేస్తున్నారని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సారా తయారీ దారులపై కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సారా విక్రేత అరెస్ట్

టి.నరసాపురం: సార విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు. బండివారిగూడెం గ్రామంలో నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో వ్యక్తిని అరెస్టు చేసి, 30 లీటర్ల నాటుసారా, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని సీజ్ చేశామని హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఎదురెదురుగా ఢీకొన్న బైక్, కారు

జంగారెడ్డిగూడెం రూరల్: జొన్నవారిగూడెంలో జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెం మండలం చిన్నంవారిగూడెంకు చెందిన కలపాల సుబ్బయ్య ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వచ్చారు. తిరిగి చిన్నంవారిగూడెం వెళుతుండగా సుబ్బయ్య దిచక్రవాహనం, ఎదురుగా జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న కారు ఢీకొన్నాయి. గాయాలపాలైన సుబ్బయ్యని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

షాక్‌తో చూడి గేదె మృతి

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌కు చూడి గేదె బలైంది. బయ్యనగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. తలారి వెంకటేశ్వరరావు అనే రైతుకు చెందిన చూడి గేదె శనివారం పుంత రోడ్డు పక్కన మేతమేస్తుండగా విద్యుత్తు పోల్ సపోర్టు వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.95 వేలు ఉంటుందని తెలిపారు. రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందేలా కృషి చేయాలని పంచాయతీ పాలకవర్గం తరఫున కోరింది.

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు వేసవి సెలవుల నేపథ్యంలో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండప ప్రాంతంతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య చేతుల మీదుగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ విద్యాభ్యాసాన్ని ఒక తపస్సులా భావించిన రోజున, వయసుతో సంబంధం లేకుండా విజయం వరిస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో నేర్చుకునే వృత్తి విద్యా కోర్సులు ఎప్పటికీ ఉపాధి మార్గాలే అన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే ఉద్యోగాలు సాధించడం శుభపరిణామమని, ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి ఐదుగురు విద్యార్థులు ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు సాధించారని వివరించారు. వీరందరికీ శనివారం నియామకపత్రాలు అందజేశామన్నారు. కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ జీఎం అంజయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గెలుపోటములపై జోరుగా బెట్టింగులు

చింతలపూడి నియోజకవర్గంలో రూ.లక్షల్లో పందాలు

చింతలపూడి : అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేలడానికి ఇంకా 10 రోజుల వ్యవధి ఉంది. ఈలోగా అభ్యర్థుల గెలుపోటములపై చింతలపూడి నియోజకవర్గంలో బెట్టింగుల జోరు ఊపందుకుంది. గతంలో ఈ బెట్టింగులు రాజకీయ నేతలు, రాజకీయాలపై ఆసక్తి ఉన్న కొద్ది మందికే పరిమితమై ఉండేది. ఈసారి సామాన్యుల కూడా బెట్టింగులకు ఆసక్తి చూపడంతో ఊహించని స్థాయిలో పందాలు సాగుతున్నట్లు తెలిసింది. చింతలపూడి అసెంబ్లీ బరిలో వైఎస్సార్ సీపీ నుంచి కంభం విజయరాజు, టీడీపీ నుంచి సొంగా రోషన్ కుమార్‌ల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే, తమ పార్టీ విజయం సాధిస్తుందంటూ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు రూ.లక్షల్లో పందాలు కాయడానికి సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఓటర్లు విజయరాజు వైపే కొమ్ము కాశారని పోలింగ్ రోజున ఓటింగ్ సరళిలో అది స్పష్టంగా కనిపించిందని ఆపార్టీ నాయకులు ధీమాగా చెబుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థి గెలుపుపై పందాలు కాసే వారి సంఖ్య పెరిగింది. కొన్ని పార్టీల్లో నాయకుల మెజార్టీపై పందాలు కడుతుండగా, మరికొన్ని పార్టీల్లో గెలుపోటములపై పందాలు కాస్తున్నారు. అలాగే రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రి అవుతారన్న దానిపైనా ఎక్కువ మంది పందాలు కాస్తున్నట్టు సమాచారం. ఎన్నికలపై బెట్టింగులు కట్టడం చట్టరీత్యా నేరమని ఎన్నికల సంఘం, పోలీసులు హెచ్చరిస్తున్నా బెట్టింగ్ రాయుళ్లు లెక్క చేయడం లేదు. నియోజకవర్గం నాయకులే కాకుండ ఇతర జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్లు భారీగా తరలివచ్చి ఇక్కడ తిష్ట వేసినట్లు తెలిసింది. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎవరి పట్ల ఓటర్లు మొగ్గు చూపారు? ఎవరు గెలిచే అవకాశాలు ఉన్నాయి? అన్న సమాచారం సేకరించి అభ్యర్థుల గెలుపుపై అవగాహనకు వచ్చిన అనంతరం స్థానిక మధ్యవర్తులను సంప్రదించి రూ.లక్షల్లో బెట్టింగులకు దిగుతున్నట్టు సమాచారం. ఓట్ల లెక్కింపు తేదీ నాటికి ఈ బెట్టింగుల జోరు రూ.కోట్లు దాటవచ్చునని చెబుతున్నారు.

కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అప్పనవీడులో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న పద్మావతి

పెదపాడు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు పద్మావతి తెలిపారు. మండలంలోని అప్పనవీడులో ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో శనివారం మాసిక మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టరు పద్మావతి మాట్లాడుతూ కిశోర బాలికలు అనారోగ్యం బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు పోషకాహారం తీసుకోవాలని తెలియజేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కిశోర బాలిక దశ నుంచే పౌష్టికాహారం, ఆరోగ్య అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి పాఠశాల నిర్వహకులు మాధవీలత, సీడీపీఓ విజయలక్ష్మి, అదనపు ప్రాజెక్టు అధికారి ఎం సునీల్ రాజశేఖర్, కార్యాలయ విస్తణాధికారి మల్లిక, సూపర్‌వైజర్ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	12

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	11
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	04, 06
బెండకాయలు	48	కంద	60
పచ్చిమిర్చి	80-84	బీట్‌రూట్	36
కాకర కాయలు	54	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-50	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	44